

# వేటూరి సాహితీ ఝరి



తెలుగుచలనచిత్రచరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక అధ్యాయాన్ని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న శ్రీ వేటూరి సుందరరామమూర్తి గారు, సినీరంగప్రవేశానికి ముందే ఎన్నో కవితలు, గేయాలు, గేయరూపకాలు, కథలు, వ్యాసాలు, సినీ సమీక్షలు, సీరియల్స్ వ్రాశారన్న విషయం అందరికీ తెలిసి ఉండకపోవచ్చు. ఆ రోజుల్లో వారి కలంపేర్లు కొన్ని - శుభశ్రీ, రామం, సరళ.. వేటూరిగారి సినిమాయేతర సాహిత్యాన్ని పాఠకులకి అందించడమే ఈ శీర్షిక ముఖ్యోద్దేశం. ఈ అంశాలని కౌముదికి అందించిన, పునర్ముద్రణకి అనుమతించిన వేటూరి రవిప్రకాష్(సుందరరామమూర్తిగారి పెద్ద కుమారుడు)గారికి కౌముది ధన్యవాదాలు తెలియచేస్తోంది.

## "గాయం కరోతీతి గాయకః"
## మన చిత్రసంగీతంలో కొరవడుతున్న తెలుగుతనం

సంగీతం పాడుకొనడం - మందహాసంవంటి అందమైన వరమన్నాడు ఒక భావుక చక్రవర్తి. అవును సంగీతం పాడటం సంతోషపడటం మానవులకే ప్రత్యేకమని, నవ్వడం మనిషి తప్ప జంతువులెరుగవనీ, శాస్త్రవిదులు అంటారు. అనుభవం కూడా తద్భిన్నంగా సాక్ష్యం ఇవ్వదు. కనుకనే సంగీతంను నాస్వంతం అనే ధీమా మానవుడిలో నిండి నిబికృతమై ఇష్టారాజ్యంగా సంగీతం పై పెత్తనం చెలాయిస్తున్నాడు మానవుడు. దానితో గాయకుడు కేవలం పాటకుడేకాక 'గాయం కరోతీతి గాయకః' అని చౌ చౌ భాషలో అర్థం చెప్పుకోవలసివస్తూంది. నిజంగానే సంగీతానికి గాయాలు అనేకం తగిలాయి. అందుకు నిదర్శనం కేవలం చిత్ర సంగీతం వేస్తూన్న వెర్రితలలు.

మానవుడికి నిత్యజీవితంలో కలిగే అనుభూతి విశేషాలలో అదనంగా కలిగే అవ్యక్త మధురానుభూతులన్నీ 'కళా'రూపంలో వ్యక్తమవుతాయని విశ్వకవి రవీంద్రుని నిర్వచనం. దాన్ని ఆవేశమని కొందరంటే కాదు 'కళ' అంటారు కొందరు. అలాగే హృదయంలో స్పందించే మధురభావాలు కొన్ని పొర్లి బయటికి కవితగా, శిల్పంగా, చిత్రలేఖనంగా ఇత్యాదిగా వస్తాయి. సంగీతంగా మానవుడు తీసే మూలుగులో, దీర్ఘంలో ఉన్న మాధుర్యమల్లా అతని భావనలో మధురిమ, మధురిమలో మలయానిలం, ఆ నిలంలో ఆప్యాయత, ఆప్యాయతలో నైర్మల్యమూను.

విశృంఖలంగా జన్మ ఎత్తిన ప్రతిదానికీ లోకంలో కొన్ని కట్టుబాట్లు చుట్టుకుంటాయి. బిడ్డడు పుట్టగానే బొడ్డుకోయడం నుంచీ వాడి దైనందిన జీవితాన్ని మతం, సంప్రదాయం శాస్త్రం శాసిస్తాయి. తదనుగుణంగా వాడూ పౌరుడుగా పెరుగుతాడు. మానై అసలు లొంగడు, వాడు సంఘానికి తీరని సమస్య.

అలాగే ఉద్భవించిన ప్రతికళకూ కొన్ని సంప్రదాయాలుంటాయి. దాని ప్రవర్ధనానికి కొన్ని రీతులు శాస్త్రం నిర్దేశించింది. అది ఆ నిర్దేశాలకు అనుగుణంగా ప్రవర్ధిల్లి సంప్రదాయం త్రోసిరాజనని, అసలుకే ఎసరు పెట్టని ఏ నవ్యరీతి అయినా శాస్త్రం గౌరవిస్తుంది. అది నూతనకళారీతిగా పరిఢవిల్లుతుంది. అలా పుట్టి పెరిగిన మన శాస్త్రీయ సంగీతానికి నేటి సుగమ (లలిత) సంగీతం ఒక నూతన రీతి. ఈ రీతికి దోహదం చేసినది నేటికాలంలో ముఖ్యంగా చలనచిత్రపరిశ్రమ. తరువాత ముఖ్యంగా చెప్పదగినది రేడియో.

సినిమా సంగీతం చూస్తే నాటికీ నేటికీ హస్తిమశకాంతరం తేడా కనిపిస్తున్నది. వెనక తెలుగు సినిమాలలో అచ్చు తెలుగు లలిత సంగీతం వినిపించేది. తెలుగు గడ్డపై పుట్టిన గుండెకు అది గోంగూర ఘుమాయింపు, గడ్డ పెరుగు కమ్మదనం, అందించేది. కాని రానురాను ఇతరేతర సంగీత సౌరభవైవిధ్యంతో తెలుగుపాటలో కల్తీ ఎక్కువయిపోయింది. హిందీవాసన గుప్పుమని తెలుగుతనం తెరమరుగైపోయింది కృత్రిమమూ, భావప్రధానమూ అనే పేరుతో ఎక్కువగా ప్రస్తారరీతిన సాగే ఔత్తరాహిక సంగీత ప్రభావం పడటంతో - ఆ రకమైన బాణీలకు మాటలు కూర్చే తెలుగు కలం పడికట్టు రాళ్ళవంటి పట్టుడు ముక్కలు 'ట్యూన్స్'లో పడవేసి కట్టుదిట్టం చేయడం జరుగుతోంది. ఇందుకు నిదర్శనంగా ఏ ఒకటి రెండు పాటలో తీసివేస్తే దాదాపు అన్ని పాటలూ మన సినిమాల్లో చౌచౌ బాణీలూ, వగైరా వగైరా రాగాలుగానే ఉంటాయి. వీటికి తోడు హాస్యనటుల గాత్రధారులు తీసే గవాయ్ సంగీతాలూ, రాక్ - ఎన్ - రోల్ పాటలు కూడా సంగీతానికి గొడ్డలిపెట్టుగా పరిణమించాయి ఇది కేవలం తెలుగు తెరకు పట్టిన తెగులు కాదు. ఇది సాముదాయికంగా తమిళ, హిందీ రంగాలకూ ఉంది.

అయితే ఈ నూతనరీతులన్నీ మంచివి కాదంటారా అంటారేమో?

నిష్ఠూరమైనా నిజం చెప్పాలంటే సుతరాము కావు. ఎంత గొప్పదయినా, అపూర్వమైనదైనా గుడ్డిగా అనుకరించడం తప్పు. కళ విషయంలో మరీ తప్పు. అలా అనుకరిస్తే అది అభ్యుదయం కాకపోగా సాంకర్యం అవుతుంది అది కళారీతి పతనానికి, మన సంప్రదాయం సంకరం కావడానికి దారి తీస్తుంది.

బెంగాలీ సంగీతం చూడండి. అది నాటి నుంచీ నేటి దాకా వంగదేశపు రంగునే వేసుకుంటున్నది కాని, బొంబాయి షేర్వాణీలుగాని, మద్రాసు తలపాగాలు గాని ధరించడంలేదు. అందుకే బెంగాలీ చిత్రాలలోని సంగీతం బెంగాలీ సంప్రదాయాన్ని వినిపిస్తుంది. ఆ సంగీతం బెంగాలీ హృదయాన్ని ఆవిష్కరిస్తుంది.

దీనికి కారణం ఏమిటి?

బెంగాలీ చిత్రాలలో సంగీతం అయిన దానికీ కాని దానికీ వినిపించదు. కూరలు కొనడానికి మార్కెట్‌కు వెడుతుంటేనూ, పొయ్యిదగ్గర వంటచేసుకుంటుంటేనూ, చంద్రుడు కనిపిస్తేనూ, కనిపించకపోతేనూ, ఒంటరిగానో జంటగానో ఉంటేను, ఊరికే సంగీతం పొర్లి ప్రవహించదు బెంగాలీ చిత్రాలలో. కృత్రిమంగా 'హెచ్ టు ఓ' కలిపితే నీరయినట్టు - ఓ పాడే గొంతూ, పాడేందుకు నాలుగుముక్కలూ, ప్రక్క వాద్యాలూ ఉంటే సంగీతం తయారుకాదు బెంగాలీ తెరమీద.

అదే వారికీ మనకూ తేడా. మన చిత్రాలు కృత్రిమ సంగీతం తయారించే "మ్యూజిక్ లేబరేటరీ" లయిపోతున్నాయి.

ఈ దుస్థితి (లేకపోతే దురాచారం) తీరే వరకూ మన సంగీతం వెర్రితలలు వేయడం మానదు. ప్రతిదానికీ పాట కట్టడం మన సంప్రదాయం కాదు. బాణీ కట్టడమూ అంతే. అందుకనే మనం బాణీలు అరువు తెచ్చుకుని మన సంగీత తీరిని కలగాపులగం చేస్తున్నాం.

ఏ జానపద రీతినో, చక్కని సుగమగీతులనో అనుసరించి మూడుపూలు ఆరుకాయలుగా మన సంగీతం వర్ధిల్లడానికి చిత్ర సంగీత దర్శకులూ, గాయకులూ కృషిచేయాలి. సాంకర్యం తగదు.

*"రామం" (రచనాకాలం:1961)*

**COMMENTS**